క్లుప్తంగా

మహిళల అభ్యున్నతికి కుట్టు శిక్షణ



కారంచేడులో కుట్టు శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికంగా ఎదిగేలా కుట్టు శిక్షణలు అందిస్తున్నామని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన కారంచేడు గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీసీ, ఓసీ మహిళల్లో ఆసక్తి కలిగిన మహిళలను ఎంపిక చేసి ఈ శిక్షణ అందిస్తున్నామన్నారు. 90 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో మహిళలకు కుట్టు మిషన్‌లపై శిక్షణలను అందించి వారికి సర్టిఫికెట్‌లో పాటు, ఉచిత కుట్టు మిషన్ కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఎల్‌కే కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, కుట్టు శిక్షణ కేంద్రం ట్రైనర్, మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఆయన మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలోని రామానాయుడు ఇండోర్ స్టేడియంలో నిర్వహించే యోగా తరగతుల్లో పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలి

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా చేయడంతో పాటు ప్రజల ఆరోగ్య స్థితిగతులు నమోదు చేయాలని పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. మంగళవారం ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ఆశ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆశ కార్యకర్తలు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

చీరాల టౌన్: ప్రభుత్వం అందించే పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీవో శివసుబ్రమణ్యం సూచించారు. మంగళవారం సచివాలయాల సెక్రటరీలు, వివిద శాఖల ఉద్యోగులతో మాట్లాడారు. మండలంలోని 15 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల వివరాలు, కూలీల జాబ్‌కార్డులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించడంతో పాటు పశు వైద్యశిబిరాలను కూడా నిర్వహించేల చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహిస్తేనే సత్ఫలితాలను సాధించవచ్చన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, సచివాలయాల ఉద్యోగులు, పంచాయతీల సెక్రటరీలున్నారు.

డయేరియా నివారణకు చర్యలు



స్వర్ణలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ మాధురీసి ఫోరా

కారంచేడు: డయేరియా నివారణకు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉందని స్వర్ణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హస్మప్రియ అన్నారు. మంగళవారం స్వర్ణ పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. వాంతులు, విరేచనాలతో పాటు నీరసంగా ఉంటుంటే వెంటనే ఏఎన్‌ఎం లేదా, పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్‌ఎస్ ద్రావకం వినియోగించాలన్నారు. అలాగే వాతవరణంలో ఉన్న మార్పులను బట్టి లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నోడల్ ఆఫీసర్ మాధురీసిఫోరా, హెచ్‌ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్‌ఈ మీనాకుమారి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతో నాయకత్వ లక్షణాలు



మాట్లాడుతున్న మోహన్‌రావు

వేటపాలెం: ఉన్నత చదువులు చదివినవారికి నాయకత్వ లక్షణాలు అధికంగా ఉంటాయని సాహితీ వేత్త, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బట్ల మోహనరావు పేర్కొన్నారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో కిశోర బాలికలకు నాయకత్వ లక్షణాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు, సేవా నాయకులు, భక్తి భావ స్వాములు నాయకత్వ లక్షణాలతో ఎందరినో మంచి మార్గంలో నడిపిస్తున్నారని గుర్తు చేశారు. స్కూలు దశ నుంచే ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని చెప్పారు. ఐసీడీఎస్ ప్రసన్న పాల్గొన్నారు.

ఎన్నికలంటే చంద్రబాబుకు పూనకాలు వస్తాయనడంలో ఎలాంటి సందేహంలేదు. ఆయన హామీల చరిత్ర చూసివారికి ఇది తెలుస్తుంది. గత ఎన్నికల్లో కూడా ఇష్టం వచ్చినట్లు వాగ్దానాలు ఇచ్చిన బాబు.. ఇప్పుడు డబ్బులేవంటూ పేద పలుకులు పలుకుతున్నారు. ఏడాది పాటు ఆయన తీరును చూస్తే చీరాల నియోజకవర్గానికి ఆయన ఇచ్చిన హామీలు ఇక నెరవేరేలా కనిపించడంలేదు.

- నయ వంచనగా కూటమి సంవత్సర పాలన
- గాలిలో చీరాల అభివృద్ధి
- నమ్మి ఓట్లేసిన నియోజకవర్గ ప్రజలు



హామీ ఏడాదీ..!

చీరాల: 'చేనేతలు, అన్నదాతలను ఆదుకుంటా. ఐటీ హబ్ ఏర్పాటు చేస్తా. అన్ని రంగాల్లో చీరాలను ముందంజలో నిలుపుతానని' సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు నీరుగారి పోతున్నాయి. అన్నదాలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడుతుంటే..ఆగ్గిపెట్టెలో పట్టేలా పట్టు చీరలు నేసిన చేనేతల చేతులు నేడు మట్టి పని కోసం వెంపర్లాడుతున్నాయి. బాపట్ల జిల్లాను టూరిజం హబ్‌గా మారుస్తానని, కొమ్మమూరు కెనాల్ ఆధునికీకరణ చేస్తానంటూ బూటకు హామీలకే ఆయన పరిమితమయ్యారు.

రైతులకు దొరకని ప్రోత్సాహం

తాను అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.384.07 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ అన్నదాలను ఆదుకున్న దాఖలాలు లేవు. రబీ సీజన్లో పెట్టుబడి సాయం ఇవ్వలేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించలేదు. చంద్రబాబు హామీతో అన్నదాతలు పండించిన పంటలు దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ నట్టేట ముంచుతున్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తారని రైతులు ఎదురుచూస్తున్నా అమలయ్యేలా లేవు.

చేనేలు విలవిలా..

బాపట్ల జిల్లాలోని చీరాలతో పాటు పొద్దుటూరు, ధర్మవరం, జమ్మలమడుగు, పెడన, ఐలవరం, బద్వేలు, ఆత్మకూరు, తాటిపర్తి వంటి ప్రాంతాల నుంచి 40 ఏళ్ల క్రితం వలసలు వచ్చిన కార్మికులు స్థానికంగా మాస్టర్‌వీవర్లకు సంబంధించిన చేనేత షెడ్డుల్లోని మగ్గాలపై పని చేస్తూ జీవనం సాగిస్తుంటారు. చీరాల, పర్చూరు, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలో సుమారు 15 వేల మగ్గాల వరకు ఉండగా 20వేల చేనేత కుటుంబాల వారున్నారు. వీరిలో 50 శాతం మంది చేనేత వృత్తిపై ఆదారపడి జీవిస్తున్నారు. చట్టం ప్రకారం కార్మికుడికి రోజుకు రూ.206 చెల్లించాల్సి ఉన్నా.. దాని గురించి మాట్లాడేవారే లేరు. చేనేత మగ్గాలపై పీస్ వర్క్ చేస్తున్నారనే కారణంతో కూలీ ధరలు పరిగణించలేమని కార్మికశాఖ చేతులెత్తేసింది.

ఐటీ పార్కు ఇంకెప్పుడు...?

చీరాల్లో ఐటీ పార్కు ఏర్పాటు చేస్తామని.. ఇంట్లో ఉండే ఐటీ పనులు చేసుకోవచ్చని.. సాఫ్ట్‌వేర్ డెవలప్ చేసేలా ఐటీ పార్కు ఏర్పాటు చేస్తానని నేటి సీఎం మాట ఇచ్చారు. ఇది కూడా అమలుకాని హామీగా మిగిలింది.

తల్లికి వందనం లేదా?

ఎన్నికల ముందు తల్లికి వందనం ద్వారా పిల్లల చదువులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు చొప్పున ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో కుటుంబానికి ఒక్కరు చొప్పున 1,16,019 మందికి రూ.174.02 కోట్లు ఇచ్చారు. ఇప్పుడు నలుగురు సంగతి దేవుడెరుగు కుటుంబానికి ఇద్దరు చొప్పున ఇచ్చినా రూ.350 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అయినా ఇప్పటికి ఈ పథకంపై స్పష్టత ఇవ్వలేదు. ఎన్నికల్లో కూటమి నేతలు అధికారంలోకి రావాలన్న ఏకైక లక్ష్యంతో కుప్పలు తెప్పలుగా హామీలు కురిపించారు. డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో లక్షన్నర కోట్లు, స్వయం ఉపాధికి రూ.10 వేల కోట్లు, రూ.5వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ తదితర పథకాలతో ప్రజలను తమ వైపు తిప్పుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిపై అతీగతీ లేకపోవడంతో చీరాల నియోజకవర్గంలోని ప్రజలు ఉసూరుమంటున్నారు.

క్షయ వ్యాధితో జాగ్రత్త



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, క్షయవ్యాధి నిర్మూలన సిబ్బంది

చీరాల రూరల్: ప్రాణాలను హరించే క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శ్రీదేవి అన్నారు. చీరాల టీబీ యూనిట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కావూరివారిపాలెం, వేటపాలెం మండలం ప్రసాదనగం ప్రాంతాల్లో క్షయవ్యాధి నివారణపై మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 60 ఏళ్ల పైబడినవారు, పొగతాగేవారు, గత ఐదు సంవత్సరాల నుంచి క్షయవ్యాధి కలిగినవారు, దగ్గుతో బాధపడుతున్నవారు, పోషకాహార లోపం ఉన్నవారు, క్షయవ్యాధి కలిగిన కుటుంబ సభ్యులు, ఆర్‌టీపీసీఆర్-క్లి పరిక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకుంటూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్మూలన సిబ్బంది కె. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా జేడీ రమేష్ ఆదేశాల మేరకు 100 రోజుల పాటు క్షయవ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధితో బాధపడుతూ మందులు వాడుకుంటున్న వారికి వారి బ్యాంక్ అకౌంట్లో ప్రతినెలా రూ. 1,000 జమ చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కె. పెర్సి, సచివాలయం సిబ్బంది, ఆశ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మేలైన విత్తనాలతో మంచి దిగుబడులు



మాట్లాడుతున్న ఏఓ సుబ్బారెడ్డి

జె.పంగులూరు: ఖరీఫ్ సన్నద్ధతలో భాగంగా ప్రతి రైతు మేలైన విత్తనాలు విత్తుకోవాని ఏఓ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బైట మంజులూరు, రామకూరలో మాట్లాడుతూ ఈ సంవత్సరం రుతుపవనాలు, అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున గ్రామాల వారికి రైతులు వ్యవసాయ పనులకు సమాయత్తం అవుతున్నారన్నారు. ప్రతి రైతు నాణ్యత కలిగిన మేలైన విత్తనాలు ఎంచుకోవాలని, విత్తనాలు కొనుగోలు చేసే మయంలో బిల్లు తప్పని సరిగా తీసుకోవాలని తెలిపారు. యూరియా 50 శాతం రాయితీపై, పచ్చిరొట్ట విత్తనాలు జీలుగా కేజీ రూ. 61.50 కాగా, జనుము రూ. 54.50 పై రైతు సేవా కేంద్రంలో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకొని పొందవచ్చని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో సాగరు నీటిని విడుదల చేసిన తరువాత వరి విత్తనాలతో నారుమళ్లు వేసుకోవానలి తెలిపారు.

డీలర్లు అందుబాటులో ఉండాలి



డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

జె.పంగులూరు: వికలాంగులకు, వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ పి. సింగారావు అన్నారు. మంగళవారం ఎంఆర్‌ఓ పి. సింగారావు ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు వారి పరిధిలోని వికలాంగులు, వృద్ధులను గుర్తించి వారికి ఇంటి వద్దనే బియ్యం, పంచాదార పంపిణీ జరిగే విధంగా చూడాలన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గటల వరకు అందుబాటులో ఉండాలన్నారు.

జాగ్రత్తలతో ఫ్లోరోసిస్ నుంచి రక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ అనీల్ కుమార్

అద్దంకి: జాగ్రత్తలతో ఫ్లోరోసిస్ నుంచి రక్షణ పొందవచ్చని డాక్టర్ అనీల్ కుమార్ అన్నారు. గాజులపాలెం యూపీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ జయసింహ ఆధ్వర్యంలో మంగళవారం ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఫ్లోరోసిస్ లక్షణాలు దాని వలన కలిగే నష్టాల గురించి వివరించారు. పాఠశాల విద్యార్థులకు వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఫ్లోరోసిస్ బారిన పడిన వారికి ప్రభుత్వం వీల్ చైర్స్ అందిస్తుదని తెలిపారు.

'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి తరలిరండి



కొప్పరపాడులో మాట్లాడుతున్న కృష్ణబాబు

బల్లికురవ: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ అమలు చేయకపోగా అరాచకాలు, మోసాలతో పబ్బం గడుపుకుంటోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవనేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం ఉదయం జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి గ్రామాల వారీగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి కొప్పరపాడు, కొమ్మినేనివారి పాలెం, వైదన, కొత్తూరు, కూకట్లపల్లి, గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు.

ఉదయం అద్దంకిలో వైఎస్సార్ విగ్రహానికి, పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్ విగ్రహాలకు అద్దంకి ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి పూలమాలలు వేసి అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేస్తారని తెలిపారు.

యద్దనపూడి: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకు బుధవారం ఉదయం 9 గంటలకు పర్చూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ యద్దనపూడి మండల కన్వీనర్ రావూరి వేణుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్చూరులోని కొల్లా వారి కల్యాణమండపం నుంచి ఎమ్మార్వో ఆఫీసు వరకు ప్రభుత్వంపై నిరసన ర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

అద్దంకి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం అద్దంకిలో వెన్నుపోటు దిన కార్యక్రమాన్ని నిర్వహించనన్నట్లు పానెం చిన హనిమిరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 9.30 గంటలకు పట్టణ 20 వార్డులోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, బంగ్లా రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయనున్నట్లు చెప్పారు.

తరువాత వైఎస్సార్ సీపీ నాయకులతో శాంతియుత ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

సంతమాగులూరు(అద్దంకి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నేడు అద్దంకిలో నిర్వహించనున్న వెన్నుపోటు దిన కార్యక్రమానికి తరలి రావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ వూట్ల నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వసతి గృహం అడ్మిషన్లు ప్రారంభం

మార్టూరు: బాపట్ల జిల్లా మార్టూరులోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సీహెచ్ రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే బాలికల హాస్టల్ అడ్మిషన్ల కోసం 9052908845, 8639508164 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పచ్చి రొట్ట పైర్లతో భూసారం పెంపు

బల్లికురవ: మెట్ట మాగాణి భూముల్లో పచ్చి రొట్ట పైర్లు అయిన జనుము, జీలుగ సాగుతో భూసారం పెంచుకోవచ్చని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి అన్నారు. ఖరీఫ్ పంటల సాగుకు సమాత్తంపై మంగళవారం ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడాలని నాణ్యత కలిగిన మేలైన విత్తనాల ఎంపికతో విధిగా బిల్లు తీసుకోవాలని కౌలు రైతులు బీసీసీఆర్‌సీ కార్డులు పొందాలని కుమారి కోరారు.

మోటారు బైక్ ఢీ.. మహిళకు తీవ్ర గాయాలు

మేదరమెట్ల: మోటార్ బైక్ ఢీ కొట్టడంతో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ సమీపంలో మంగళవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మల్లవరం గ్రామానికి చెందిన దిబ్బమ్మ ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్లే బస్సు ఎక్కేందుకు బస్టాప్ వద్ద నుంచుంది. ఈ క్రమంలో మేదరమెట్ల వైపు వెళ్లే మోటారు బైక్ అదుపు తప్పి మహిళను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆ మహిళకు తీవ్ర గాయాలు కాగా, హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఇళ్ల వద్దనే రేషన్ అందించాలి



కొత్తపేటలో వృద్ధుడికి రేషన్ సరుకులు అందిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర నాయుడు, పక్కన తహసీల్దార్ పార్వతి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేయాలని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్ నాయుడు సూచించారు. మంగళవారం చీరాలతో పాటు వేటపాలెం మండలంలోని కొత్తపేట గ్రామంలో రేషన్ దుకాణాలను తహసీల్దార్లు కె.గోపికృష్ణ, పి.పార్వతితో కలిసి తనిఖీ చేశారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు షాపు తెరచి సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడినా, సరుకులకు బ్లాక్ మార్కెట్ తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా అమ్మవారి శిడి మహోత్సవం

వేటపాలెం: నాయినిపల్లిలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి 49వ శిడి మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శిడిమానుకు శిడిపోతును కట్టి ఆలయం చుట్టు మూడు సార్లు ప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.


పార్టీ బలోపేతానికి కృషి చేయండి



ఆసోది బ్రహ్మానందరెడ్డికి శాలువా కప్పి అభినందిస్తున్న ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): పర్చూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అనుబంధ విభాగాల అధ్యక్షులు కృషి చేయాలని పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి సూచించారు. మంగళవారం తన స్వగృహంలో ఆయనను కలిసేందుకు వచ్చిన నాయకులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజక వర్గంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర విభాగంలోని కార్యదర్శులు, మండల కమిటీలు ఏర్పాటు చేశారని, క్యాడర్‌ను ఉత్సాహపరచి, పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన నియోజక వర్గ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడుగా నియమితులైన ఆసోది బ్రహ్మానందరెడ్డికి శాలువా కప్పి అభినందించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బిల్లాలి డేవిడ్, చినగంజాం మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్, ఎం. హేమంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి



మాట్లాడుతున్న సీఐ

అద్దంకి రూరల్: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ సుబ్బరాజు అన్నారు. మంగళవారం డ్రగ్స్ నివారణకు అద్దంకి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై కనపెట్టుకొని ఉండాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొన్న బైక్.. వ్యక్తి మృతి

జె.పంగులూరు: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వేగంగా బైక్‌పై వచ్చిన వ్యక్తి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జాగర్లమూడివారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. అద్దంకి ఎస్‌వీబీ కాలనీకి చెందిన గుంటూరు శ్రీనివాసరావు (60) రాత్రి 9 గంటల సమయంలో జాతీయ రహదారిపై మార్టూరు నుంచి బైక్ పై అద్దంకి వస్తున్నాడు. ఇదే సమయంలో జాగర్ల మూడివారిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై లారీ డీజిల్ అయిపోవడంతో ఆగింది. డ్రైవర్ దిగి చూస్తుండగా వెనుక నుంచి వచ్చిన శ్రీనివాసరావు బైక్ ఒక సారిగా లారీ వెనుక భాగంలో బలంగా ఢీ కొట్టాడారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది, 108 సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీరాల అర్బన్: పట్టణంలో సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ బి.హరిప్రసాద్ మంగళవారం తెలిపారు. టౌన్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్డీఓ ఆఫీసు, మున్సిపల్ ఆఫీసు, రైల్వేస్టేషన్ రోడ్డు, పాలిమేరరోడ్డు, బెస్తపాలెం, ఆర్‌ఆర్ రోడ్, క్లాత్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

వేటపాలెం: వైర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశాయిపేట పంచాయతీ పరిధిలో అంతరాయం కలుగుతుందన్నారు.

మేదరమెట్ల: మండలంలోని సోమవరప్పాడు సబ్ స్టేషన్‌పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. రావినూతల రోడ్డు, మిద్దెల దొంక, సోమవరప్పాడు, గుంటూరు రోడ్డు ప్రాంతాల్లో చెట్లు నరికివేత కారణంగా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా శిక్షణలో పాల్గొన్న ప్రజలు

చీరాల టౌన్: ప్రతి రోజూ యోగా చేయడం వలన మానసిక రుగ్మతలు తొలగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని చీరాల ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం సూచించారు. ఈనెల 21 జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సచివాలయాల ఉద్యోగులకు, గ్రామస్తులకు ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, దేవాంగపురి హైస్కూల్లో యోగా విన్యాసాలతో పాటు యోగా విశిష్టతల శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగడంతో పాటుగా ఏకాగ్రత పెరుగుతుందన్నారు.



బల్లికురవలో యోగా చేస్తున్న దృశ్యం

బల్లికురవ: ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ 45 నిమిషాలు యోగా చేయాలని అంబడిపూడి ఆయుష్ వైద్యశాల ఫార్మసిస్టు శేషశాయి కోరారు. మంగళవారం బల్లికురవలో రెండో బ్యాచ్‌కు యోగాపై అవగాహన కల్పించారు. సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ఆసనాలు అలవాటు చేసుకోవాలని సూచించారు.